# నాన్నకిచ్చిన మాట

ఆ 'లాలాపురం'లో ముత్యాలు, గోపయ్యలది వ్యవసాయ కూలీ కుటుంబం. వారికి లేక లేక మగబిడ్డ పుట్టాడు. బంగారు కాంతితో మెరిసిపోతున్నాడు. దంపతుల ముఖంలో ఆనందం తాండవం చేసింది. తమకు అటువంటి బిడ్డను ప్రసాదించినందుకు కృతజ్ఞతలతో తమకు ఇష్టదైవమైన వెంకటేశునికి కొబ్బరికాయకొట్టి దండం పెట్టుకున్నారు.

''కొడుకు రంగు, రూపు, ముఖం, ముక్కు అంతా మా అయ్యలా వున్నాడు'' అంది ముత్యాలు.

''కాదు.మా అయ్యలా వున్నాడు''అన్నాడు గోపయ్య.ఇద్దరికీ మధ్య కాసేపు వాదులాట జరిగింది పుత్ర వాత్సల్యంతో. వీడి పేరు 'ఎంకన్న' అని పిలిచారు ఇద్దరూ ఒక్కసారే. చిత్రమేమిటంటే ముత్యాలు తండ్రి పేరు, గోపయ్య తండ్రి పేరు అదే కావడంతో ఇద్దరి నోటి నుండి ఆ పేరు మంత్రంలా వచ్చింది.ఇక ఏ పేచీ లేదు. లేకపోతే మళ్ళా కాసేపు కీచులాట వుండేదేమో.

ముత్యాలు కొడుకుని వీపుకతికించుకుని కింద దించకుండా పెంచుతోంది. గోపయ్య పనులు ముగించు కొని ఇంటికి రాగానే బోసి నవ్వులతో కేరింతలు కొట్టే తన కొడుకును చూసి ఆరోజు కష్టమంతా మరిచిపోయే వాడు. వాణ్ణి తన గుండెలపై ఆడించుకొని ముద్దు తీర్చుకునే వాడు. ఇలా ఆ గారాల బిడ్డడు పెరగసాగాడు.

చూస్తుండగానే ఎంకన్నకు ఏడేళ్ళూ వచ్చాయి. అయినా అక్షర జ్ఞానం తెలియని ఆ దంపతులు ఎంకన్నను బడికి పంపించడం గురించి ఆలోచించలేదు. పెరిగి పెద్దవాడయినాక తమ రెక్కలకు సాయపడతాడనుకున్నారే కానీ మరో ఆలోచనలేదు. ఎంకన్న తన ఈడు పిల్లలు ఎవరూ లేకపోవడంతో తమ ఇంట్లో పశువుల దూడలతో గెంతులు వేస్తూ, కేకలు పెడుతూ పొలాల గట్లంట ఆడుకుంటున్నాడు.

❖ ❖ ❖

ఒకరోజు తనకంటే వయసులో పెద్దవాడైనా వరుసకు అల్లుడయ్యే వీరేశం ఎంకన్నను కలిశాడు. వీరేశానిది అవతలి వీధి. రోజూ బడికి బుద్దిగా వెళ్తుంటాడు. వాళ్ళ వీధిలో బడికి వెళ్ళేవాడు ఒక్కడే కావడంతో తోడుగా ఎంకన్నను కూడా తీసుకెళ్దామనుకున్నాడు. అదే విషయం ఎంకన్నను అడిగాడు.

''ఎంకన్న! బడికి వస్తావా?'' అని.

''బడా! అంటే ఏంటిరా?'' అమాయకంగా ప్రశ్నించాడు ఎంకన్న.

''ఓహో నీకు తెలియదు కదూ! బడి అంటే చదువు నేర్చుకునే ఇల్లు. అక్కడ మధ్యాహ్నం అన్నం కూడా పెడతారు'' అంటూ అభినయ పూర్వకంగా చెప్పాడు వీరేశం.

''అన్నం అంటే ఏంటిరా?...''

''అన్నంటే తెలియదా... బువ్వరా... బువ్వ పెడతారు బళ్ళో వస్తావా?'' అన్నాడు వీరేశం.

వెంటనే ఎంకన్న ముఖం బంతిపువ్వులా విచ్చుకుంది. అపునువరి ఒక్కపూట జొన్న సంకటితోటే కడుపు నింపుకునే ఆ నిరుపేద డొక్కకు మధ్యాహ్నం బువ్వ పెడ తారనంగానే అంత ఇదిగా సంబరపడ్డాడు. గవర్నమెంటు చేసిన ఏకైక మంచిపని మధ్యాహ్న భోజనం. ఎంకన్న లాంటోళ్ళకు అదొక వరం.

''సరే గాని మరి నాకు 'లాగు... సొక్కా' లేదుగా! బోసి మొలతో ఎట్లా వచ్చేనురా?'' అంటూ దీనంగా కళ్ళుపెట్టి ప్రశ్నించాడు ఎంకన్న వీరేశాన్ని.

''ఏం పర్లేదు. నా 'లాగు' తొడుక్కుందువుగాని పదా పోదాం'' అంటూ తన ఇంటికి ఎంకన్నను తీసుకెళ్ళి తనకున్న రెండు నిక్కర్లలో ఒకదాన్ని ఎంకన్నకు తొడిగి బడికి రమ్మన్నాడు వీరేశం.

ఎంకన్న ఒక సత్తుకంచం చేతిలో పట్టుకుని, వీరేశం చేతిలో చెయ్యేసి, ఏదో తెలియని ఉత్సాహంతో బడి

కన్నెగంటి వెంకటయ్య

# స్వయంవరం

అమ్మాయికి స్వయంవరం
ఆమె చేయినందుకోవడం వరం
ఆమె చక్కని చుక్క
అయస్కాంతపు చెక్క
అందుకే బుగ్గన
దిష్టి చుక్క
అమ్మాయికి
చిటికెనవేలు
అందించడానికి
అర్రులు చాచే
బేహారులెందరో
కళ్ళు బైర్లుకమ్మేట్టు
కట్టలు కట్టలుగా నోట్లు
ఎదురు కుమ్మరించే
కుబేరులెందరో
మహాకవీ
మళ్ళీ కన్యాశుల్కం
వచ్చేసినట్టు
భూమి గుండ్రంగానే
వున్నట్టు
పగటి కలలు కంటున్నాం
ఆడపిల్ల తల్లిదండ్రులకు మాత్రం
ఈ పెళ్ళి మహాసంబరం
ముసలా ముతకా కూడా
ముచ్చటపడే
అమ్మాయి సొగసైనది
కల్పవృక్షమూ
కామధేనువూ
ఎడమచేతి
చూపుడేవేలు పిల్లని
దోచుకుపోయేందుకు
ఐదేళ్ళకో
మధ్యంతరంగానో
పెళ్ళిమీద పెళ్ళి
చేసుకునేందుకు
ఎగరేసుకుపోయేందుకు
అమ్మాయిని
దోచుకునేందుకు
పిల్లని
మాటలతో
మాటలతో
మెప్పిస్తూ
ఒప్పిస్తూ
ఎందరెందరు దొరలో
దొరకనంతవరకూ
అందరూ
దొరలే సుమా!

బద్ది నాగేశ్వరరావు

బాట పట్టా ఎంకన్న. స్నేహం కోసం వీరేశం. బువ్వకోసం ఎంకన్న, ఇద్దరూ కలిసి మిత్రులయ్యారు.

బడిలో మాష్టారు ఎంకన్నను చూసి ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు. ఒంటిపై ఒక నిక్కరు, సగం ఒళ్ళు, చీముడు ముక్కు, చింపిరి జుట్టతో భారత దేశపు ఆర్థిక పరిస్థితికి నిలువుటద్దంలా వున్న ఎంకన్నను ఎగాదిగా చూశాడు మాష్టారు. వాడి వాలకం అలావున్నా, వాడికి భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉంటుందని, విశాలమైన వాడి నుదురు కాంతిపుంజంలా వున్న వాడి కాళ్ళు ఆ రకంగా ప్రేరేపించాయి మాష్టార్ని.

"చదువుకుంటావా" అన్నాడు మాష్టారు. అదేందో అర్థంకాకపోయినా బిక్కుబిక్కుమంటూ చేతులు నలుపు కుంటూ "ఆ..." అన్నాడు ఎంకన్న.

"మీ నాన్నపేరేం పేరు" అన్నాడు మాష్టారు.

''గోపయ్య'' అన్నాడు వెంకన్న.

''మీ అమ్మ పేరు?''

''ముత్యాలు''

''మీరెంతమంది?''

''నేనూ... మా పెద్దక్క చిన్నక్క... అమ్మ, అయ్య...'' అంటూ ఒక్కో ప్రశ్నకి సమాధానం చెప్పాడు ఎంకన్న.

వాడిలో వున్న ఆ బెరుకుపోగొట్టడానికే అలా ఇంటి విషయాలు మాట్లాడాడు మాష్టారు. కొద్దిసేపటికి వాడిలో భయం తొలిగిందని అనిపించాక, వీరేశం పలక బలపం తీసుకొని దానిపై 'ఓం' అని, 'అ, ఆ' అని వ్రాసి, ఒకటి రెండు మార్లు ఎంకన్నతో పలికించి, మూడోసారి మళ్ళీ పలికించి వాటిని ఎలా దిద్దాలో చేయిపట్టుకొని చూపించాడు మాష్టారు. అలవాటులేని చెయ్యి అయినా మాష్టారు చెప్పినట్టే నడుచుకొంది. 'వీడికి తొందరగానే చదువు వస్తుందనుకొన్నాడు' మనసులోమాష్టారు.

''బాగా చదువుకో' అని వీపు తట్టి వీరేశం సరసన కూర్చోబెట్టాడు.

ఎంకన్నకు అంతా కొత్తగా వుంది. బెరకు బెరకుగా అందరి పిల్లలవైపు, బడి గోడలవైపు చూశాడు. వీరేశం ఎంకన్న భుజంమీద చేయివేసి అక్షరాలు ఎలా దిద్దాలో చూపించాడు. స్నేహానికి చక్కని నిర్వచనం వీరేశం. ఆ చిన్ని బుర్రలో ఎంకన్న గురించి ఆ ఆలోచన ఎందు

## శివనానీలు

మీడియా మేనక
మురిపిస్తుంది.
ప్రపంచపు
విశ్వామిత్రుణ్ణి!

పార్లమెంటులో
మహిళా బిల్లు?
త్రిశంకు స్వర్గంలో
శకుంతల

నీతి, నిజాయితీ
మన నేస్తాలు
కాని, మారుతున్నాయ్
మన రాస్తాలు!

శ్వాసిస్తే బతుకు
ఆగిపోతే చావు
ఇంతకు మించి
వాస్తవముంటుందా!

ఆత్మలేని ఎన్నికలతో
ప్రజాస్వామ్యం
పూటకోపొత్తు
జాముకో ఎత్తు!

విద్యలేక
వింత పశువు వాడు
విద్యతో
సంత పశువు నేడు!

సమాజపు
హాలహలం చలం
అసమానతలపై
రణం శ్రీశ్రీ

విద్య - వికాసమునేవి
మూడవ నేత్రం!
అవి లేకుంటే
అంధత్వం!

రాజకీయ సభల్లో
గర్జించే నేతలు
ఆచారణలో మాత్రం
అచ్చంగా పీతలు!

ఎక్కడికెళ్ళాడో
వావిలాల
గుర్తుకొస్తున్నాడు
ఈవేళ!

*టి.సాంబశివరావు*

కొచ్చిందోగాని వాడి బ్రతుకునే మార్చేసింది.

ఎంకన్న యాంత్రికంగా అక్షరాలయితే దిద్దుతున్నాడు గాని ధ్యాసంతా బువ్వమీదే వుంది. పంజరంలో రామ చిలుక జామపండుకోసం చూసినట్టు, ఎంకన్న 'అన్నం ఎక్కడ వండుతున్నారు? ఎప్పుడు పెడతారు? ఎవరు పెడతారు? మధ్యాహ్నం ఎప్పుడయిద్దా' అనుకుంటూ ఎదురు చూస్తున్నాడు. మధ్యాహ్నం గంట గణగణ మోగింది. పిల్లలందరూ తమ కంచాలు తీసుకొని బిల బిలమంటూ అన్నం వడ్డించే 'వంటలమ్మ' దగ్గరకు కేక లతో, కేరింతలతో చేరుకున్నారు.

మాష్టారు అందర్నీ వరుసలో నిలబడమన్నారు. ఎంకన్న తన వంతుకోసం, దైవదర్శనానికి వచ్చిఫలహారం కోసం ఎదురుచూసే భక్తుడిలా ఎదురుచూస్తున్నాడు. తనవంతు రానే వచ్చింది. కంచంలో 'వంటలమ్మ' గంటెడు ముద్ద. ఇంత చింతచారు పోసింది. ఎంకన్న ఎంతో ఆరాటంగా, ఆబగా తినటం మొదలేశాడు. వాడ్నే తదేకంగా వాడికి తెలియకుండా గమనిస్తున్నాడు మాష్టారు.

చూస్తుండగానే ఒక సెకనులో రెండే రెండు ముద్దల్లో తినేశాడు ఎంకన్న. చిన్నవాడైనా ఆకటి పేగు లతో మధ్యా హ్నం బువ్వలేక నకనకలాడిన వాడు కదా... కంచం అడుగు కూడా నాకినంత శుభ్రంగా తినేశాడు.అది గమనించిన మాష్టారు, ఎంకన్నకు మరో ముద్ద అన్నం ఇంత చారు పోయించాడు. కడుపునిండా తిన్నాడు ఎంకన్న. 'ఆకలి ఇంత భయంకరంగా వుంటుందా!' అనిపించింది మాష్టారుకి. అన్నం తిన్నాక కృతజ్ఞతా భావంతో మాష్టారు వైపు చూశాడు ఎంకన్న. గురువుగారు కూడా కళ్ళతోటే దీవించాడు. సాయంత్రం బడి మొద లయ్యింది. అందరూ బిగ్గరగా చదువుకుంటున్నారు.

ఆ వీధి బడి ఆ వూరి పీర్ల సావిడి. అది ఊరికి మధ్యలో నాలుగు బజార్లు కలిసే చోట వుంది. ఎంకన్న వాళ్ళ ఇంటికి వెళ్ళాలంటే బడివీధి నుండే వెళ్ళాలి. సాయంత్రం కూలిపని చూసుకొని గడ్డపలుగుకు పార, తట్ట తగి లించుకొని ఎంకన్న తండ్రి ఇంటిముఖం పట్టాడు.

ఊళ్ళోకి రాగానే అప్రయత్నంగా వీధి బడివైపు చూపు మళ్ళింది. మొదట నమ్మలేదు. తన కళ్ళు మోసం చేస్తు న్నాయనుకున్నాడు. భ్రమ పడుతున్నానుకుంటున్నాడు గోపయ్య. కానీ నిజం. ఆరుబయట చెట్టుకింద అందరి పిల్లల్లో తన కొడుకు చాలా స్పష్టంగా కనిపించాడు. వాడు 'అ...ఆ' అంటూ అక్షరాలు దిద్దుకుంటున్నాడు. అలా నిలబడి చూస్తున్న గోపయ్యను మాష్టారు గమనించాడు.

గోపయ్య మాష్టారుకి తెలుసు. అందుకే గోపయ్యను దగ్గరకు రమ్మని పిలిచాడు. ''చూడు గోపయ్యా! ఎంకన్న నీ కొడుకా?''

''అవునయ్యా...'' అంటూ వినయంగా సమాధాన మిచ్చాడు గోపయ్య.

''గోపయ్యా! నీ కొడుకు చదువుకుంటాడంట. వాడికి ఒక పలక, బలపాల పెట్టె, జత బట్టలు కొనిపెట్టు. రోజూ బడికి పంపించు. బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు వుంటుంది.ఎందుకో... నీ కొడుకు గొప్పోడవుతాడనిపి స్తుందయ్యా'' అంటూ పిల్లల మనసు తెలిసిన మష్టారు. చెప్పుకుపోతున్నారు. గోపయ్యకు కొడుకు గొప్పోడవు తాడనే మాటవరకు మంచిగా వినపడ్డాయి. ఆ తరువాత మాష్టారు ఏం చెబుతున్నారో సరిగా విన్లేదు. ఒక్క నిమి షం నిలువుగుడ్లేసుకుని కొడుకు గురించి ఊహాలోకాల్లో తేలిపోయాడు.

''గోపయ్యా!'' అని మాష్టారు పిలవడంతో మళ్ళా ఈ లోకంలోనికి వచ్చేశాడు.

''అట్లాగేనండి. నా కట్టమంతా ఈడికోసమేగా. ఇంత కంటే ఏం కావాలి నాకు. మీరు చెప్పినట్టే సేత్తానండి'' అంటూ గబగబ ఇంటికెళ్ళాడు. పార, తట్ట, పలుగు మూల్న పడేసి. కాళ్ళు చేతులు కడుక్కొని, కాసిన్ని మంచి నీళ్ళు తాగి, పరుగులాంటి నడకతో పట్నం పోయాడు. పిల్లవాడికి కావలసినవి, మాష్టారు చెప్పినవి చెప్పినట్టే కొనుక్కొని చీకటి పడకముందే ఇంటికి చేరుకున్నాడు. ఆరోజు వచ్చిన డబ్బులు పిల్లవాడికి ఖర్చు చేశాడు. నూకలు కూడా తేలేదు. ఆపూట పస్తే పడుకున్నారు. అయినా బాధలేదు. కొడుకు గొప్పోడవుతాడంటే ఎన్ని రోజులైనా పస్తులుంటాననుకున్నాడు.

పొద్దున్నే పొరుగింటి పెద్దమ్మవాళ్ళు కాసింత గంజి పోస్తే తాగి, నాన్న తెచ్చిన కొత్త బట్ట వేసుకొని పలకా, బలపం తీసుకొని బడికి నడిచి వెళ్తున్న ఎంకన్నను చూసి తల్లీదండ్రీ ఎంతో మురిసిపోయారు. ఇన్నాళ్ళు కొడుకు గురించి, చదువు గురించి ఆలోచించనందుకు, తన్ను తానే తిట్టుకున్నాడు గోపయ్య. వీరేశాన్ని మనసులోనే మెచ్చుకున్నాడు. వాడే లేకపోతే తనకి ఈ బడి సంగతే తెలిసేదికాదు. ఎంకన్న ఇంట్లో బువ్వవున్నా లేకున్నా బడికి వెళ్ళటం మాత్రం మానలేదు.

ఆ ఊరిలో ఐదో తరగతి దాకా వుంది. ఆరు, ఏడు తరగతులకు పొరుగూరు పల్లిపాడు వెళ్ళాలి. ఎంకన్న ఐదో తరగతి పూర్తి చేసుకొని ఆరో తరగతికి పల్లిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో చేరాడు. చదువులోనూ,

సంస్కారంలోనూ, ఆటల్లోను, పాటల్లోనూ ఎంతో పేరు తెచ్చుకున్నాడు. తోటి విద్యార్థులకు మంచి మిత్రుడు. ఉపాధ్యాయులకు అభిమాన శిష్యుడు. అలా రోజులు గడుస్తున్నాయి.

❖ ❖ ❖

ఒకరోజు... ''పూటకు గతిలేనోడికి సదువుగావలట సదువు. పోరడ్ని ఏ రైతుకైనా జీతం వుంచితే, ఈ పూట పస్తులు వుండేవికాదుగా. చెబితే వినరు వెధవనాయాళ్ళు. కొడుకు సదవి కలెక్టరయితడా? వూళ్ళేలతాడా! ఉద్యోగాలు సేత్తాడా? దొంగ ముం...'' అంటూ బూతుల పంచాంగం తిరగేశాడు. ఎంకన్న మేనత్త భర్త మల్లయ్య, కొద్దిగా ధనవంతుడు, పొలంపుట్రా వున్నోడు. కాని చదువు గురించి ఏమీ తెలియనివాడు. పిసినారి. అంతే కాదు. పొంగరువాడు. ఎవడన్నా మంచిగా ఎదిగితే ఓర్వలేనోడు. అందుకే ఎంకన్న చదివి గొప్పోడవుతాడేమో. తనకు మించిన వాడవుతాడేమోనని అసూయ. నోరు గల్లోడు కూడా. ఆయన నోటికి భయపడి ఎవరూ ఎదురు చెప్పరు. పాపం గోపయ్య నోట్లో నాలుక లేనోడు. బావ అంత తిడుతున్నా ఏమి మాట్లాడకుండా తలవంచుకొని నిలబడ్డాడు. ఎంకన్నకు గుండెల్లో మండుతోంది. కానీ ఏమి చేయగలడు. బొటబొట రెండు కన్నీళ్ళు నేలరాల్చాడు.

❖ ❖ ❖

రోజులు గడుస్తున్నాయి. అవి ఎండాకలం రోజులు. అందరూ సాయంత్రం వేళ ఆరుబయట మంచాలు వేసుకుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. అదీ ఆ వీధి 'అరుగు' దగ్గర. చుట్టుపక్కల వాళ్ళంతా తమకు తోచింది ఏదో మాట్లాడుతున్నారు. వాళ్ళ మాటల మధ్యలో చదువు సంగతి వచ్చింది.

''మా ఇంటి పక్క ముత్తిగాడ్ని చూడండి. వాడికి ముగ్గురు కొడుకులు. ముగ్గురూ రైతులకు జీతాలు వున్నారు. ఒక్కొక్కడికి పుట్టెడు జొన్నలు వత్తాయ్. ముత్తిగాడు కాలిమీద కాలేసుకొని దర్జాగా తింటున్నాడు. బాంచెత్ వ ఆడిది బతుకంటే. మా గోపిగాడ్ని చూడండి. దరిద్రనాయాలు కొడుకుని కలక్టర్ సేత్తాడంట. సదివిత్తడంట. సదువు! గతిలేని నాయాలు'' అంటూ ఆ జనం మధ్యలో వున్న గోపయ్యను చూపిస్తూ మళ్ళా మొదలేశాడు మేనత్త భర్త మల్లయ్య. రోజు రోజుకు అతనిలో ఓర్వలేనితనం పెరిగిపోతుంది.

అపుడు గోపయ్య ''చూడు బావా! అక్క మొగుడివి కదా అని ఊరుకుంటంటే రెచ్చిపోతున్నావు. నా కొడుకు సదువుకుంటంటే కుళ్ళు ఎళ్ళగక్కుతున్నావ్. నీ ఇంట్లో సొమ్మేమన్నా పెడతన్నవా నాకూ, నా కొడుక్కి. నువ్వు అనవసరంగా నోరు పారేసుకోకు. నా తనువు తాకట్టు పెట్టయినా సరే, బిచ్చమెత్తయినా సరే, నా కొడుకును సదివించుకుంటా. ఆఁ... ఇకమీదట నా గురించి గాని, నా కొడుకు గురించి గానీ వాగేవా? మర్యాదగుండదు జాగ్రత్త!'' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా, శివాలెత్తినట్లు ఊగిపోతూ-తీవ్రకంఠ స్వరంతో బావను హెచ్చరించాడు.

ఇంకెవరూ నోరు మెదపలేదు. బావ మల్లయ్య బిత్తరపోయి చూస్తూ నిలబడ్డాడు. నోటెంట మాట పెగల్లేదు. ఒళ్లంతా చెమపట్టింది. అక్కడున్నోళ్ళంతా ఎవడికివాడే 'నాకెందుకొచ్చిందీ గోలంత' అంటూ చిన్నగా జారుకున్నారు. మంచోడికి కోపం వస్తే ఎట్లా వుంటుందో కళ్ళారచూశారు అక్కడి జనమంతా. పదిమందిలో అవమానకరంగా మాట్లాడిన మల్లయ్య కూడా తన తప్పు తెలుసుకున్నట్టు ఉన్నాడు. దెబ్బకు దెయ్యం కుదిరిందన్నట్లు మేనత్త భర్త మాటలపోటు తగ్గింది ఎంకన్నకు గోపయ్యకు.

కానీ తను కూడా వాళ్ళు మాట్లాడుకున్న ప్రదేశానికి దగ్గరే వుండటం వలన అన్ని మాటలు విన్నాడు ఎంకన్న. మేనత్త భర్త మాటలకు మనసంతా పిసికేసినట్లు బాధపడ్డాడు. అదే సందర్భంలో అందుకు ప్రతిగా తండ్రి చెప్పిన బుద్ధి, ఎంకన్న మనసులో ముద్రపడ్డాయి. 'తనువు తాకట్టుపెట్టయినా కొడుకును సదివిత్తా' అన్న మాటలు ఎంకన్న చెవులో మార్మోగుతున్నాయి.

తనకోసం, తన చదువుకోసం తండ్రి తపన వృథా కావొద్దనుకున్నాడు. తను బాగా చదివి మంచి ఉద్యోగం సంపాదించుకొని, తనను ఎగతాళి చేసినవారికి తగిన సమాధానం చెప్పాలనుకున్నాడు. దాన్ని సాధించడం కోసం కంకణబద్ధుడయ్యాడు. 'నీ కోరిక నెరవేరుస్తా నాన్న' అని తండ్రికి మనసులోనే మాటిచ్చాడు. ఆ సంవత్సరం ఏడవతరగతి చదువుతున్నాడు.

❖ ❖ ❖

ఏడో తరగతి పరీక్షల ఫలితాలు వచ్చాయి. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఎనిమిదో తరగతి చదవడానికి తన ఊరికి 4 కిలోమీటర్లు దూరంలో వున్న 'పైరా' ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. అక్కడే ఇంటర్ కూడా ఉండేది. ఉదయం హైస్కూలు సాయంత్రం కళాశాల నడిచేది. ఎంకన్న రోజూ పొద్దున్నే సదిదజి అన్నం తిని నాలుగు కిలోమీటర్లు నడిచి చదువులు సాగిస్తున్నాడు. ఇలా పదో తరగతికి వచ్చాడు. అప్పట్లో

విద్యుత్తు దీపాలు ఇంకా అందరికి అందుబాటులోకి రాలేదు. కొద్దో గొప్పో సంపన్నులకు మాత్రం ఆ సౌకర్యం ఉండేది.

ఎంకన్న రాత్రులు కిరసనాయిలు దీపం దగ్గర కూర్చొని చదువుకునేవాడు. ఆ దీపం వెలుగు తక్కువగా వుండటం వలన తల దీపం దగ్గరగా వంచి మరీ చదవాల్సి వచ్చేది. అట్లా చదవడం వలన దీపం పొగ ముక్కుల్లో తారులాగా పట్టేది. అంతేకాదు ఆ పొగవల్ల కళ్ళు కారం పోసినట్లు మండిపోయేవి. ఒకోసారి నిద్రవచ్చి ముందుకు తూలితే ఆ దీపం ముందు జుట్టుకు చర్రున అంటు కునేది. దిగ్గున లేచి మళ్ళీ చదువులో పడేవాడు ఎంకన్న.

బడిలో ఎక్కువమంది విద్యార్థులు వుండుటవలన, వ్యక్తిగత శ్రద్ధ లేకుండా పోయిందా పాఠశాలలో. అందు వలన ఎంకన్నకు లెక్కలు ఇంగ్లీషు సరిగా అర్థం అయ్యేది కాదు. అయినా తండ్రి ఆకాంక్ష గుర్తొస్తావుండటంవలన అర్థం అయినా కాకపోయినా బండగా చదవడం చేసే వాడు ఎంకన్న. తండ్రి తెల్లవారుజామున 4 గంటలకు రోజూ లేపేవాడు. పాసిమొఖాన చదివితే బాగా సదువు వత్తాది అనేది తండ్రి గోపయ్య నమ్మకం. ఈ మాట ఎవరో పంతులుగారు చెప్పంగ యిన్నాడంట. అందుకే అలా అలవాటు చేసేవాడు. ఈ అలవాటును ఎంకన్న ఎప్పటికీ మానలేదు.

పదో తరగతి పరీక్షలు. కండ్లల్లో త్తులు వేసుకొని మరీ చదివాడు. పరీక్షలు కూడా బాగానే వ్రాశాడు. తన వైపు ఏ లోపం లేదు. ఫలితాలు రానేవచ్చాయి. ఎంతో ఆశతో పాఠశాల దగ్గరకు వెళ్ళి ఉపాధ్యాయుల్ని అడిగాడు తన ఫలితాన్ని గురించి. ''సారీ ఎంకన్న! నువ్వు రెండు సబ్జెక్టులు తప్పావు'' అంటూ చాలా బాధగా చెప్పాడు హెడ్మాష్టర్ గారు.

ఎంకన్న ముఖంలో నెత్తురు చుక్కలేదు. ''బాగానే వ్రాశాను కదా ఎందుకు ఫెయిలయ్యాను సార్'' అంటూ బేలగా ప్రశ్నించాడు సార్‌ను. హెడ్మాష్టర్ గారు ''ఏం ఫర్వా లేదు ఎంకన్న మళ్ళా కొద్దిగా కష్టపడి చదువు. ఈసారి పాసవుతావులే'' అని భుజం తట్టాడు.

కానీ ఈ దుర్వార్త తండ్రికి తెలిస్తే... చుట్టుపక్కల వాళ్ళు ఎంత దెప్పిపొడుస్తారు'' ఇలా పరిపరివిధాలా ఆలోచిస్తూ... మూగగా రోధిస్తూ... ఇంటి దారి పట్టాడు ఎంకన్న. అసలే ఏమి తినకుండా వెళ్ళాడు. పైగా దుఃఖ భాజ్యమైన దుర్వార్త, ఎంకన్నను క్రుంగదీసింది. కళ్ళు బైర్లు కమ్మాయి ఇంటికి వచ్చేటప్పటికి.

ఈవార్త తండ్రికి ఎలా చెప్పాలో తెలియక భయ

## మానవుడు

ప్రకృతిలోని
అందాలతో పోల్చి
వర్ణించడమే కాదు
సుఃఖ సంతోషాలను పంచీ
తోడుగా నీడ నిలిచే వాడు
నిజమైన ప్రేమికుడు
జీవిత పోరాటాల్లో
చేయుత నిచ్చి
చేయి వీడాక గమ్యం
చేరటానికి విశ్వాసాన్ని
ధైర్యాన్ని అందించే వాడు
నిజమైన స్నేహితుడు
మూర్ఖులను జ్ఞానవంతులుగా
మార్చే
జీవితార్థాన్ని నేర్పి
అనురాగాన్ని ఆనందాన్ని
నలుగురికి పంచే
ఉత్తములుగా తీర్చిదిద్దవాడు
నిజమైన గురువు
అవినీతిపరులను
అన్యాయంగా ప్రవర్తించే
వాళ్ళను ఎదురించీ
నీతిగా న్యాయంగా
నడిచేట్లు చేయువాడు
నిజమైన నాయకుడు
అన్నీ సద్గుణాలను
అలవర్చుకొని
శత్రువులను సైతం
ప్రేమతో స్నేహితులుగా
మార్చుకొని,
అందరి హృదయాల్లో
స్థిరనివాసమేరు పర్చుకొనేవాడు
నిజమైన మానవుడు

ఎం. బలరాం

## రెక్కలు

**ముం**దు దారి వుంటే
కాలు సారించు
దారి లేకుంటే
కొత్త దారి సృష్టించు
ముఖ్యమైంది
ముందడుగు!
పగలు గడిచిపోయాక
రాత్రి పలకరిస్తుంది
కన్నీరు ఇంకిపోయాక
దరహాసం చిగురిస్తుంది
వెలుగూ చీకటీ
రెండూ సత్యాలే!
దీపం చుట్టూ
వెలుతురు
దీపం కిందమాత్రం
నీడ
బయటి చూపే కాదు
లోచూపూ ముఖ్యమే
ఒక కోరిక
తీరింది
వెనువెంటనే
మరోటి పుట్టింది
అంతులేనిది
ఆశ!
ఎగిరే
గాలిపటానికి
దారం కొన
భూమ్మీదే.
నేల విడచిన సాము
కుదరదు

*సి.మనస్విని*

పడుతూ మౌనంగా కూర్చొన్నాడు.ఎలా తెలిసిందో గాని చుట్టుపక్కలవాళ్ళకు, ఇరుగుపొరుగు వాళ్ళకు, ఎవరికైతే తన చదువు ఇష్టంలేదో వాళ్ళందరికీ తెలిసింది.

''గాడిదలాగా తిరిగితే చదువు చంకనాకిందన్నారు'' కొందరు. ''చదువంటే మాటలా ఈ మొద్దు మొఖాలకేనా వచ్చేది'' అంటూ మరికొంతమంది దీర్ఘాలు తీశారు. గుండెల్లో ఈటెల్లా తగులుతున్నాయి వాళ్ళమాటలు. ఆఖరుకి తల్లికూడా వాళ్ళ తిట్లకు తను కూడా శృతి కలిపింది. కానీ తండ్రి ఒక్కమాట కూడా అనలేదు. అదే మరింత బాధించింది ఎంకన్నను. తన బతుకు ఇంతే సంగతులని, తీవ్రంగా ఆలోచిస్తూ... పడుకున్న మంచం మీద రోదిస్తూ అలసిపోయి అలానే పడుకున్నాడు.

'నాన్న నన్ను క్షమించు, నాన్న క్షమించు...' అంటూ కలవరిస్తున్న ఎంకన్నను చూసి తట్టుకోలేకపోయాడు తండ్రి గోపయ్య. అలాగే చూస్తూ కొడుకు తలపై చేయి వేసి నిమురుతూ... దీనికి తగిన కారణం తెలుసు కోవాలనుకున్నాడు.

❖ ❖ ❖

కాలం వారింది. వర్షాభావ పరిస్థితులు నెల కొన్నాయి. ఎంకన్నకు ఇద్దరు అక్కలు వారికి కిందటేడు పెళ్ళి చేయడంవలన అప్పులు కూడా పెరిగిపోయాయి. అప్పుల బాదలోపడి కొడుకు చదువు గురించి ఆలోచిం చలే తండ్రి. అప్పులోళ్ళ పోటు తట్టుకోలేక తన తండ్రి సంపాదించిన ఐదు ఎకరాల పొలంలో మూడు ఎకరాలు అమ్మేశాడు గోపయ్య. ఎంకన్న ఒక సంవత్సరంపాటు కూలి పనులు చేస్తూ కాలం గడిపాడు. కలుపులు తీశాడు, మట్టి తట్టలు మోశాడు, వరి కోతలు కోశాడు, కుప్పలు నూర్చాడు. ఒక్కటేమిటి వ్యవసాయం పనులన్నీ చేశాడు.

అయితే రోజు రోజుకు ఎంకన్న క్షీణిస్తున్నాడు. ముకంలో కళాకాంతి లేవు. మనిషి పాలిపోయాడు. దిగా లుగా యంత్రంలాగా తిరుగుతున్నాడు. తండ్రి కొడు కును చూసి ఆందోళన చెంది, ఒక డాక్టరు గారికి చూపిం చాడు. డాక్టరు అన్ని పరీక్షిలు చేశాడు. ఏ రోగం లేదు. కానీ మనేది రోగం వుంది. అదేంటో తెలుసుకొంటే నీ కొడుకు బాగుపడతాడన్నారు డాక్టరు.

''మనేదుకు మందులు లేదు. దివాలుకు దిక్కు లేదు'' అన్న సామెత గుర్తొచ్చింది గోపయ్యకు. కొడుకుకి చదువంటే ప్రాణం. ఎప్పుడయితే వాడు చదువుకు దూరమయ్యాడో అప్పుడే వాడు జీవచ్ఛవం అయ్యాడు. ఇది గమనించిన గోపయ్య కొడుకును ఎలాగైనా

దక్కించుకోవాలనుకున్నాడు. అక్క భర్తకు విసిరిన సవాల్ గుర్తొచ్చింది.

''నాయినా! ఎంకన్న! బొక్కులు సంచిలో పెట్టుకో వైరా పోదాం'' అన్నాడు తండ్రి.

'ఎందుకు? ఏమిటి?' అని ప్రశ్నించకుండా తండ్రిని అనుసరించాడు అప్పటికప్పుడు ఉదయాన్నే ఎంకన్న. అది ప్రయివేటు స్కూలు. అక్కడి ప్రిన్సిపాల్ గారి దగ్గర ఎంకన్న తండ్రి కొన్నాళ్ళు జీతం చేశాడు. ఆయన్ని బతివాలి ఆ పాఠశాలలో ట్యూషన్ చెప్పించాడు గోపయ్య ఎంకన్నకు.

ఎంకన్న రోజురోజుకు హుషారుగా బడికిపోతున్నాడు. మనిషి మునపటిలా చలాకీగా, ఆనందంగా కనిపించాడు. లెక్కలు, ఇంగ్లీషు అరటి పండు ఒలిచినంత సులువుగా అర్థమయ్యాయి ఎంకన్నకు. రెట్టించిన ఉత్సాహంతో సప్లిమెంటరీ పరీక్షలు వ్రాశాడు. ఉత్తీర్ణుడయ్యాడు. తన కిష్టమైన చదువు మళ్లీ దగ్గరయినందుకు మనసులోనే తండ్రికి కృతజ్ఞతలు చెప్పాడు ఎంకన్న.

ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూపులో వైరాలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నాడు. సెకండ్ క్లాస్ మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. బోధివృక్షం కింద కూర్చున్న బుద్ధుడికి జ్ఞానోదయం అయినట్లు, ఒకసారి ఫెయిల్ కావడంతో ఎంకన్న గుణపాఠం నేర్చుకున్నాడు. తనకు తానే మారాలనుకున్నాడు. అంతే ఇక వెనుతిరిగి చూడలేదు.

డిగ్రీ ఖమ్మం ప్రభుత్వ కళాశాలలో చేరాడు.

మూడేళ్ళ డిగ్రీని సైన్సు గ్రూపు బియస్సీ చదవాల్సివుండగా... ఖర్చు భరించి చదివే స్థితి తనకు లేదని భావించి, ఆర్ట్స్ గ్రూపులో చేరాడు. మొదటి సంవత్సరం మొదలు ఫైనల్ ఇయర్ వరకు రోజుకు 12 గంటల చొప్పున చదివాడు. పరీక్షలు వ్రాశాడు. ఫస్ట్‌క్లాస్ మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. తనతోపాటు మరో ముగ్గురు ఆ ఊరి విద్యార్థులు కూడా డిగ్రీ పాసయ్యారు. ఊరు ఊరంతా వాళ్ళు ఐ.ఏ.ఎస్ పాసైనంత గొప్పగా చెప్పుకుంటున్నారు. గోపయ్యను, ముత్యాలును చుట్టుపక్కల వాళ్ళంతా అభినందించారు. మంచి కొడుకును కన్నావన్నారు. ఎంకన్నను, గోపయ్యను ఆ వూరి పెద్ద ఇంటికి పిలిపించుకొని అభినందించాడు.

అదేరోజు ఎంకన్న పెద్ద మేనత్త వచ్చింది ఎంకన్న వాళ్ళింటికి. ''ఏందిరో గోపిగా! తెగ సంబరంగున్నావు? కొడుకేందో పాసయ్యాడట! అయితే ఏంటిరా. ఏం ఎలగబెడతాడురా నీ కొడుకు. ఎప్పుడన్నా పుట్టిల్లు గదా! అని ఇంటికి వస్తే కడుపునిండా తిన్నాను... ఎప్పుడూ పూటకు పూటకు దేవులాటేనా. 'నేరడ'లో వున్న నీ తమ్ముడు కొడుకులు జీతాలుబడి వడ్లు, జొన్నలు సంపాదిస్తున్నారు. వాడి ఇంటిలో కాళ్ళకింద తొక్కు కుంటూ వడ్లల్లోనే తిరుగుతారు. నీ ఇంట్లో... తూ: ఈ కొంప గాలి పోను. ఎప్పుడు అడుక్కుతింటమే... సంసారం నిప్పుబడ'' అంటూ శాపనార్థాలు పెట్టింది.

ఆనందం క్షణంలో మాయమయ్యింది. ఆ తిట్లతో వాళ్ళ మొఖాన. అయితే ఎంకన్న తండ్రి తీవ్ర అసహనంతో ''ఒకప్పుడు చిన్నక్క మొగుడు ఇట్టానే తిట్టాడు. ఇప్పుడు ఈమె తయారయ్యింది. ఇక లాభం లేదు. కొడుకు పెద్దవాడయ్యాడు. చదువులో పేరు తెచ్చుకుంటున్నాడు. ఈ సందర్భంలో ఈ మొగుడు చచ్చిన దాని శాపాలు మంచిది కాదనుకొన్నాడు.

''అక్కా! చుట్టంచూపుగా వచ్చిన దానివి ఇంట్లో వుంది కలో గంజో తినిపో. లేదంటే ఎప్పుడూ నా ఇంటికి రాకు. వచ్చినా ఇట్లాంటి మాటల్తో అనవసరంగా వాగేవా... అక్కవని కూడా చూడను'' అంటూ హుంకరించాడు. పెద్ద మేనత్త ఏమనుకుందో ఏమో గానీ వచ్చింది వచ్చినట్టే ఇంటి దారిపట్టింది. పీడ విరగడయ్యింది అనుకున్నాడు. ఎంకన్న.

❖ ❖ ❖

ఉస్మానియా యూనివర్సిటిలో పి.జిలో చేరాడు కానీ రెండు సంవత్సరాల కాలంలో ఆరు నెలలే అక్కడ వుండేవాడు. మిగతా సమయమంతా తండ్రికి పొలం పనుల్లో సాయంచేసేవాడు. తండ్రికి మోకాళ్ళ నొప్పులు వచ్చాయి. అరకదున్నలేకపోతున్నాడు. తమ్ముడు చిన్నవాడు కావడంతో బాధ్యాతాయుతంగా నడుచుకోవాల్సి వుంది. క్యాంపస్‌లో వున్నన్ని రోజులు మాత్రం పుస్తకాల పురుగయ్యేవాడు. రోజు లైబ్రరీకి వెళ్ళేవాడు. ప్రొఫెసర్ కిషన్‌రావు గారి సహకారంతో నోట్సు తయారుచేసుకొని పరీక్షలు వ్రాశాడు. యూనివర్సిటీ నాల్గవ ర్యాంకు సాధించాడు. ఎంకన్నలోని అజ్ఞాతమైన పట్టుదలను ప్రొఫెసర్ అభినందించాడు.తన ఆధీనంలో పి.హెచ్.డి దాకా చదివే అవకాశం ఇస్తానన్నాడు. కానీ...

ఆ సంవత్సరం విపరీతమైన కరువు వచ్చింద. ఇంటి దగ్గర అమ్మానాన్నలు తిండికి కటకట పడుతున్నారని తెలిసి ఎంకన్న తట్టుకోలేకపోయాడు. తను గనుక ఇంటికి పోయి ఏదో ఒక పని చేసి వాళ్ళకి తోడ్పడాలి. లేకపోతే ఆకలితోటే తల్లిదండ్రులు చచ్చేలావున్నారు. ప్రొఫెసర్ ఇంటికి వెళ్ళొద్దు యూనివర్సిటీని వదిలి? అంటూ ఎంత

వారించినా వినకుండా స్వగ్రామం చేరుకున్నాడు. తన కెరీర్ కంటే తల్లిదండ్రుల ప్రాణాలే ముఖ్యమనిపించింది. అందుకే వచ్చీ రావడంతోనే వైరాలో ఒక ప్రయివేటు కళాశాలలో లెక్చరర్‌గా చేరాడు.

ఆ కళాశాలలో తన ప్రతిభా సామర్థ్యాలతో కొద్ది రోజుల్లోనే యాజమాన్యం వారి అభిమానాన్ని చూరగొన్నాడు. విద్యార్థులకు తలలో నాలుకలా మెసిలాడు. ఎంకన్నకు కళలంటే చచ్చేంత ఇష్టం. అంచేత తనలోనే ఎప్పుడో నిద్రపోయిన గాయకుణ్ణి మేల్కొలిపాడు. కవిని కలం పట్టమన్నాడు. అంతే ఎంకన్న ప్రతి మాటా, పాట సమ్మోహనాస్త్రంలా దూసుకుపోయాయి. విద్యార్థుల పాలిట ఆరాధ్య దైవమయ్యాడు. అలా నాలుగేళ్ళు అంకితభావంతో పనిచేశాడు.

అయితే భవిత భద్రతలేని ప్రయివేటు ఉద్యోగాల కన్నా, ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలనుకున్నాడు. ఉపాధ్యాయ శిక్షణ పొందిన అనంతరం ఒక పేదింటి అమ్మాయిని ఆదర్శ వివాహం చేసుకున్నాడు. ప్రభుత్వం 2000 సంవత్సరంలో డి.యస్సీ ప్రకటించింది. ఆ డి.యస్సీలో ఖమ్మం జిల్లాలో గ్రేడ్-1 తెలుగు పోస్టు ఒకే ఒక్కటి ఓపెన్‌లో ఉంది. అయినా సరే 'ఆ ఒక్కటీ నాదే కావాలి' అని దృఢ సంకల్పంతో పరీక్షకు సిద్ద మయ్యాడు ఎంకన్న. ఏవిధమైన ఆందోళన లేకుండా లక్ష్య సాధనలో నిమగ్న మయ్యాడు.

డియస్సీ కొరకు వివిధ కంపెనీల పుస్తకాలు, తను తయారు చేసుకున్న నోట్సు, 'ఐక్య ఉపాధ్యాయ సంఘం' ఖమ్మం వారి నోట్సు కాచి వడపోశాడు. అపారమైన జ్ఞాపకశక్తి ఎంకన్న సొంతం. అంతేకాదు సంకల్ప బలం కూడా అధికంగా కలవాడు. రోజుకు 13 గంటలు చదివేవాడు. అయినా విసుగు చెందేవాడు కాదు. తండ్రి తెల్లవారుజామున లేచి చదివే అలవాటు నేర్పాడు. అది ఎంతో ఉపకరించింది ఎంకన్నకు.

'ఐక్య ఉపాధ్యాయ సంఘం' ఖమ్మం వారు మోడల్ డియస్సీ నిర్వహించారు. ఎంకన్న దానికి హాజరయ్యాడు. 300 మంది వ్రాశారు. అయినా ఎంకన్న ప్రథమస్థానంలో నిలిచాడు. అతని పట్టుదలను ఆ ఉపాధ్యాయ సంఘం మరింత ప్రోత్సహించింది. ఆ సంఘం వారు ఉచితంగా ఎందరో నిరుద్యోగులకు డియస్సీ శిక్షణ ఇస్తారు. అదెంతో నచ్చింది ఎంకన్నకు. కాబోయే ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఆ సంఘం సహాయ సహకారాలు ఎంకన్నకు సంఘంపై అభిమానాన్ని పెంచాయి.

డి.యస్సీ పరీక్షకు సర్వ సన్నద్ధమయ్యాడు ఎంకన్న. పరీక్ష చాలా ఉత్సాహంగా రాశాడు. ఆ డి.యస్సీలో 400 మంది పోటీపడ్డారు. అందులో ఎంకన్న ఒకడు. ఫలితాలు నెలరోజుల్లో వచ్చాయి. ఎంకన్న గ్రేడ్-2 పండిట్ పరీక్ష కూడా రాశాడు.

గ్రేడ్-1, గ్రేడ్-2 పండిట్ రెండింటిలోనూ ఎంకన్న మొదటి ర్యాంకు సాధించాడు. ఓపెన్‌లో వున్న 'ఏకైక' గ్రేడ్-1 పోస్టు కైవసం చేసుకున్నాడు. పట్టుదల వుంటే కొండలనైనా పిండి చేయవచ్చని నిరూపించాడు ఎంకన్న. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్', 'ప్రతిభకు పట్టాభిషేకం', 'సరస్వతీ పుత్రుడు' అంటూ పత్రికలు పతాక శీర్షికలు పెట్టి ఎంకన్నను కీర్తించాయి.

అట్టడుగు సామాజిక వర్గంలో పుట్టినవాడు. ఎంకన్న కంటే ముందు తరం వాళ్ళుగానీ, తల్లిదండ్రులుగానీ, అక్కలు బంధువులు, చుట్టుపక్కల వాళ్ళుగానీ, కనీసం ఆ వాడలోగానీ విద్యాగంధం లేదు. అయినా ఓపెన్‌లో ఒక్కటే వున్న పోస్టు ఎలా వచ్చింది? సాంప్రదాయ వాదులకు అదో శేషప్రశ్న. విద్యాభిమానులకు అదొక చైతన్య స్ఫూర్తి.

చదువుకునే రోజుల్లో ఎంకన్నపడ్డ అవమానాలు. తండ్రి తనకోసం చూపిన శ్రద్ధ, మిత్రుడు వీరేశం చూపిన దారి, చిన్నప్పటినుంచీ చదువుమీద మమకారం. అవరోధాలు ఎన్ని ఎదురైనా సడలని అకుంఠిత దీక్ష. ఇవన్నీ అతని విజయానికి కారకాలే. తనను బడిబాట పట్టించిన మిత్రుడు మధ్యలోనే ఆగిపోయాడు. ఎంకన్న మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి గెలిచాడు. నాన్నకిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు.

తనకు ఉద్యోగం వచ్చాక ఐక్య ఉపాధ్యాయసంఘం ఆహ్వానం మేరకురెండు డి.యస్సీలకు కూడా కోచింగ్ ఇచ్చాడు. చాలామంది ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు ఆ సంఘం సహకారంతో. ఎంకన్నని 'సంఘం' జ్ఞాపికలతో అభినందించింది.

ఎంకన్న ప్రగతికి మూల సూత్రదారి తండ్రి.ఒకప్పుడు ఎంకన్న తండ్రిద్వారా గుర్తింపులోకి వచ్చాడు. ఇప్పుడు గోపయ్య ఎంకన్నకున్న పేరు ద్వారా గుర్తింపు కొచ్చాడు. అది తండ్రికి ఎంతో గర్వంగా వుంది. ఎంకన్న ఇపుడు ఆ ఊరి విద్యార్థులకో రోల్ మోడల్. ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు ఆ ఊరిలో లేదు. ఎంకన్న విజయంతో మార్పులు చోటు చేసుకున్నాయి. ఎంకన్నను బడికి వెళ్తుంటే తిట్టిన వాళ్ళే ఇవ్వాళ వాళ్ళ మనుమలు, మనవరాళ్ళు బడికి వెళ్ళకపోతే తిడుతున్నారు. ■